


ఫటా ఫట్

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించండి...



ఎమ్డీ అలీమ్, ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ప్రశ్న: పత్తి కొనుగోళ్లు ఎప్పటినుంచి ప్రారంభిస్తున్నారు..?

జవాబు: సీసీఐ తరఫున పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం గురువారం ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుంటే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. రైతులు జిల్లాలో నోటిఫై చేసిన కొనుగోలు కేంద్రాలకు వెళ్లి తమ పత్తిని అమ్ముకోవచ్చు.

ప్ర: సీసీఐ ద్వారా ఎన్ని కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు?

జ: జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 కేంద్రాలలో కొనుగోలు చేసేందుకు నిర్ణయించాం. ఖమ్మం మార్కెట్ పరిధిలో గుర్రాలపాడు జీఆర్‌ఆర్, తల్లంపాడు సాయిబాలాజీ జిన్నింగ్ మిల్లులు, నేలకొండపల్లి మార్కెట్ పరిధిలో ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ జిన్నింగ్ మిల్లు, మద్దులపల్లి మార్కెట్ పరిధిలో పొన్నెకల్‌లోని జీఆర్‌ఆర్ జిన్నింగ్ మిల్లు, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని భాగ్యలక్ష్మి జిన్నింగ్ మిల్లు, వైరా మార్కెట్ పరిధిలో తల్లాడ స్టాఫిల్‌రిచ్ జిన్నింగ్ మిల్లు, మధిర మార్కెట్ పరిధిలో మంజీత్, అమరావతి, శివగణేష్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని అమ్ముకోవచ్చు.

ప్రశ్న: విక్రయించే పత్తిలో తేమ శాతం ఎంత ఉండాలి?

జ: తేమ 8 శాతం నుంచి 12 శాతం మధ్యలో ఉండాలి.

ప్రశ్న: పత్తి క్వింటాకు మద్దతు ధర ఎంత చెల్లిస్తారు?

జ: పత్తిలో 8శాతం తేమ ఉంటే క్వింటాకు రూ.7,521, తొమ్మిది శాతం ఉంటే రూ.7,446, పది శాతం ఉంటే రూ.7,295, ఇక 11, 12 శాతం ఉంటే రూ. 7,220 చెల్లిస్తారు. రైతులు పత్తిని విక్రయించేటప్పుడు ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన బ్యాంక్ ఖాతా, పట్టాదార్ పాస్‌పుస్తకం తీసుకురావాలి.

ప్రశ్న: పత్తి విక్రయించిన తర్వాత నగదు ఎప్పుడు జమ అవుతుంది? ఫిర్యాదులుంటే ఎవరికి తెలియజేయాలి?

జ: వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతుంది. ఇక రైతులు తమ ఫిర్యాదులను 88972 81111 అనే నెంబర్‌కు వాట్సాప్‌లో తెలియజేయవచ్చు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్



నేలకొండపల్లిలో విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కుల వృత్తులను గౌరవిస్తాం..

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి » గీత కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

నేలకొండపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం కుల వృత్తులను గౌరవిస్తుందని, కులవృత్తుల కార్మికులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. నేలకొండపల్లిలో బుధవారం గీత కార్మికులకు కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేశారు. అలాగే 8నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినులకు 620మందికి సైకిళ్లను పీఎస్సార్ ట్రస్టు ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇటీవల కూసుమంచి మండలంలోని విద్యార్థినులకు సైకిళ్లు పీఎస్సార్ ట్రస్టు నుంచి పంపిణీ చేశామని, అదేవిధంగా త్వరలోనే మిగిలిన రెండు మండలాల్లోని విద్యార్థినులకు సైతం సైకిళ్లు పంపిణీ చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి కాటమయ్య రక్షా కిట్లు 100 వచ్చాయన్నారు. ఎంపిక చేసిన గీత కార్మికులకు కిట్లను అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఎస్ నాగేందర్ రెడ్డి, ఏఈఎస్ వేణుగోపాలరెడ్డి, సీఐ జగన్నాథం, డీఈవో సోమశేఖరశర్మ, నాయకులు నెల్లూరి భద్రయ్య, వజ్జా రమ్య, యడవల్లి సైదులు, షైసా శంకర్, కుక్కల హనుమంతరావు, రాయపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలని, ఎట్టి పరిస్థితిలో రాజీపడొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరంలోని 60వ డివిజన్‌లో బుధవారం పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారంటీ పథకాలను 100 రోజులు లోపే అమలు చేసి చూపించామన్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక కార్పొరేటర్ బద్దె నిరంజన్‌కుమార్, మద్దినేని బేబి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు నిరుపేదలను ఎంపిక చేయాలి

అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలో మంత్రి పొంగులేటి 7

గంజాయి మత్తు యువతను చిత్తు చేస్తోంది. ఈ మహమ్మారి బారిన పడిన యువత డబ్బుకోసం చోరీలకు సైతం పాల్పడుతున్నారు. యువత గంజాయి మత్తుకు బానిసలుగా మారుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఏపీకి సరిహద్దుగా ఉన్న సత్తుపల్లి డివిజన్ ప్రాంతంలో గంజాయి వినియోగం, అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దాంతో గంజాయి విక్రయాలు, వినియోగాన్ని అరికట్టడంపై కల్లూరు డివిజన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో కల్లూరు ఏసీపీ రఘు ఆధ్వర్యంలో పటిష్ఠమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాష్ట్రప్రభుత్వం గంజాయి సహా ఇతర మత్తుపదార్థాల వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. పోలీసుల నిఘాలో భాగంగా ఈ ప్రాంతంలో సంచలన సంఘటనలు వెలుగులోకి వస్తుండటంతో తల్లిదండ్రులు సహా స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

గంజాయి గుప్పు



- » ఏపీ రాష్ట్రానికి సరిహద్దులో ఉండటంతో జోరుగా రవాణా
- » మత్తు మహమ్మారికి బానిసలవుతున్న యువత
- » అక్రమదందాలో చిక్కుకుంటున్న మైనర్లు
- » ఏపీ నుంచి యథేచ్ఛగా జిల్లాకు రవాణా
- » నిఘా పెంచిన పోలీసు శాఖ
- » తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచన

సత్తుపల్లి డివిజన్‌లో జోరుగా విక్రయాలు

సత్తుపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి పట్టణం సహా పలు గ్రామాల్లో ముఖ్యంగా యువకులు గంజాయికి బానిసలవుతున్నారు. ఆంధ్రాలోని ఆవులపాక నుంచి కొనుగోలు చేసి తెచ్చిన గంజాయిని కొందరు తమ మత్తుకోసం వాడుకొని ఇతరులకు కూడా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి మత్తుకు మైనర్లు కూడా అలవాటు పడడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. గంజాయి విక్రయిస్తున్న వారు, వినియోగిస్తున్నవారి సంఖ్య పెరుగుతుండటంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఏపీ నుంచి కేజీల లెక్కన గంజాయిని కొనుగోలు చేసి సత్తుపల్లి ప్రాంతానికి గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. గంజాయి రవాణాకు కార్లు, ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు.

పట్టుబడుతున్న యువకులు

గత నెలలో ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి పోలీసులు చేపట్టిన తనిఖీ సందర్భంగా సత్తుపల్లి పట్టణం, తాళ్లమడ గ్రామాలకు చెందిన నలుగురు యువకులను గంజాయితో సహా పట్టుకున్నారు. సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ ఆధ్వర్యంలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న వారిని 11మందిని అదుపులోకి తీసుకుని ఇటీవల విచారించారు. ఈ సందర్భంగా మొత్తం 82మంది గంజాయి సేవిస్తూ దానికి బానిసలుగా మారినట్లు విచారణలో తేలడం సంచలనంగా మారింది. సీఐ అదుపులోకి తీసుకున్న 11మందిపై కేసు నమోదుచేయగా వారి నుంచి ఐదు కేజీల 845గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తేలిన 82మందిలో మైనర్లు కూడా ఉండటం గమనార్హం. మూడు రోజుల క్రితం వీఎం బంజర ఎస్ఐ గంజాయి సేవిస్తున్న నలుగురిని అరెస్టు చేశారు. వీరిలో పెనుబల్లి మండలం (మిగతా 6వ పేజీలో)

డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్న యువత

గంజాయికి బానిసలైన కొందరు యువకులు దాన్ని కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక చోరీలకు కూడా పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులకు పట్టుబడిన వారిలో ఈ తరహాలో బైక్‌లను కూడా చోరీ చేసి సదరు వాహనాలను గంజాయి రవాణాకు వినియోగించినట్లు వెల్లడైంది. గతంలో వైట్నర్, బోనోఫిక్స్, ఫెవిక్విక్, ఇతర పదార్థాలను మత్తు కోసం యువత వినియోగించారు. ఈ తరహా మత్తు పదార్థాలను వినియోగించకుండా నాలుగేళ్ల క్రితం పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి కొంతవరకు యువత వీటికి కొంత దూరంగా ఉన్నా ఇటీవలి కాలంలో గంజాయికి అలవాటు పడుతున్నారు.

ఎస్ఏఆర్ మిల్లుకు మరో నోటీసు

» గడువులోగా సీఎంఆర్ బాకీ రూ.81 కోట్లు చెల్లించాలి

» స్పందించకపోతే ఆస్తులు వేలం వేస్తామని హెచ్చరిక

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌లో అక్రమాలకు పాల్పడిన కొణిజర్ల సమీపంలోని ఎస్ఏఆర్ మిల్లు ఆస్తుల వేలానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్ఏఆర్ మిల్లు యజమాని, కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగుకు చెందిన బాలకృష్ణ ప్రసాద్ 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్ సీఎంఆర్‌కు సంబంధించి రూ.81కోట్ల 60లక్షలు బాకీ పడ్డారు. ఈ బకాయిని తీర్చాలని గతంలో జారీ చేసిన మొదటి నోటీసు గడువు ముగిసిందని, అయినా ఎటువంటి స్పందన రాకపోవడంతో ప్రస్తుతం రెండో నోటీసు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. రెండో నోటీసు గడువులోగా బాకీ సొమ్ము చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం డిఫాల్టర్ ఆస్తులను వేలం వేస్తామని తెలిపారు.

యూట్యూబ్ చానల్ బెదిరింపులు

» ప్రైవేటు ఆస్పత్రి ఫిర్యాదు » ముగ్గురు వ్యక్తుల అరెస్టు

ఖమ్మం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన ఓ ఆస్పత్రి ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత వార్తను తయారు చేసి, యాజమాన్యాన్ని బెదిరించిన కేసులో ఓ యూట్యూబ్ చానెల్‌కు చెందిన ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ బుధవారం తెలిపారు. న్యూస్‌వాచ్ అనే యూట్యూబ్ చానల్‌కు చెందిన సీఈవో పుచ్చకాయల ప్రకాష్, బ్యూరోచీఫ్ అత్తులూరి రామకృష్ణ, అసిస్టెంట్ కెమెరామన్ ఎస్‌కె.బాబా అనే వ్యక్తులు ఖమ్మం నగరంలోని ఓ ఆస్పత్రిపై కల్పిత వార్తను తయారుచేశారు. దాన్ని సదరు ఆస్పత్రి యాజమాన్యానికి చూపించి ప్రతీ ఏడాది యాడ్స్ రూపంలో రూ.5 లక్షలు చెల్లించాలని బెదిరించారు. అలా చేయకపోతే తమ యూట్యూబ్ చానెల్‌లో న్యూస్ అప్‌లోడ్ చేసి ఆస్పత్రి పేరు ప్రఖ్యాతులను దెబ్బతీస్తామని బెదిరించారని యాజమాన్యం ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. ఈ మేరకు విచారణ చేసి బుధవారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



కొడుకును హత్య చేసిన తండ్రి

- » ఘటన జరిగిన సమయంలో ఇద్దరూ మద్యం మత్తులోనే...
- » నిద్రలో ఉండగా గొడ్డలితో దాడి
- » అక్కడికక్కడే మృతి చెందిన కుమారుడు 6

రాముడి కోసం తపించి.. జీవించి...

- » వనంలో వెలిగిన గొప్ప భక్తురాలు శబరి
- » నేడు వినాయకపురంలో భద్రాద్రి రామయ్య కల్యాణం, స్మృతి యాత్ర
- » ఏర్పాట్లు చేసిన దేవస్థానం అధికారులు 6

గ్రహణం వీడని పరిహారం

- » మంజూరైనా ఖాతాలకు జమకాని డబ్బులు
- » మున్నేరు వరద బాధితుల వెతలు 6



కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 12న ప్రారంభమైంది. 24 ఏళ్లలోపు యువత కోసం ఈ పీఎం ఇంటర్న్‌షిప్ స్కీంను రూపొందించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులకు ఇది ఒక వరంలాంటిది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదో తరగతి ఆపై చదువుకున్న చాలామంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్ స్కీంకు అర్హులు.. 10, 12వ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఫార్మసీ చదివిన 21నుంచి 24 ఏళ్ల మధ్య ఉన్న యువత ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకం పోర్టల్ సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. దేశంలోని 500 ప్రసిద్ధ కంపెనీలలో ఇంటర్న్‌షిప్ చేయడానికి 21 నుంచి 24ఏళ్ల వయస్సు గల యువత దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఇంటర్న్‌షిప్ కాలం 12నెలలు కాగా ఇంటర్న్‌షిప్ కాలంలో కనీసం సగం కాలం వాస్తవ పని అనుభవం లేదా ఉద్యోగ వాతావరణంలో గడపాల్సి ఉంటుంది.

ABC తెలుసుకుందాం..!

పేద విద్యార్థులకు వరం
పీఎం ఇంటర్న్‌షిప్

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి అర్హులైన అభ్యర్థులు pminternship.mca.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఇంటర్న్‌షిప్ సమయంలో స్టైపెండ్‌గా రూ.5,000 పొందుతారు. ఇందులో రూ.4,500 కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, రూ.500 కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సంబంధిత కంపెనీ ఇస్తుంది. ప్రతి ఇంటర్న్ కూడా ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన కింద బీమా చేయబడతారు.

26 వరకు దరఖాస్తుకు అవకాశం

ఈ పథకానికి ఈ నెల 12న ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా.. 26 వరకు అవకాశం ఉంటుంది. అక్టోబరు 27 నుంచి ఎంపికైన యువతకు ఇంటర్న్‌షిప్ చేయడానికి కంపెనీని కేటాయిస్తారు. నవంబరు 7వ తేదీలోపు జాబితాను విడుదల చేసి నవంబరు 8 నుంచి 25 వరకు ఆఫర్ లెటర్లు పంపిస్తారు. ఆ తరువాత ఇంటర్న్‌లు డిసెంబరు 2నుంచి వారికి కేటాయించిన కంపెనీలలో ఇంటర్న్‌షిప్‌ను ప్రారంభిస్తారు. మొత్తం పథకంలో కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్ విధానం వర్తిస్తుంది. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ ఇవ్వడం ద్వారా దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. దరఖాస్తు చేయడానికి ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యా అర్హత పత్రాలు తప్పనిసరిగా ఉండాలి.

ఈ రంగాల్లో అవకాశాలు

గత మూడేళ్లలో ఖర్చుల సగటు ఆధారంగా అగ్రశ్రేణి కంపెనీలను గుర్తించారు. గ్యాస్, చమురు, ఇంధన రంగానికి ఇంటర్న్‌షిప్ పథకంలో నమోదు కోసం గరిష్ట అవకాశాలు ఉన్నాయి. ఆ తరువాత టూర్-ట్రావెల్, హాస్పిటాలిటీ రంగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయి.

వీరు అర్హులు కారు..

తల్లిదండ్రులు లేదా భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు లేదా కుటుంబ ఆదాయం రూ.8 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారు లేదా పూర్తి సమయం కోర్సులు చదువుతున్న యువకులు వీటికి దరఖాస్తు అర్హులుకారు. ఐఐటీ, ఐఐఎం నేషనల్ లా యూనివర్సిటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల నుంచి డిగ్రీలు పొందిన యువత దరఖాస్తులు అంగీకరించబడవు. వృత్తిపరమైన డిగ్రీలు ఉన్నవారికీ ఈ పథకం వర్తించదు. అలాగే ఏదైనా స్కిల్ అప్రెంటిస్‌షిప్ ఇంటర్న్‌షిప్ చేసిన యువత ఈ పథకానికి అర్హులు కారు. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థి శిక్షణ కార్యక్రమంలో భాగమైన యువత ఈ పథకానికి అర్హులు కారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లేదా నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ కింద ఎప్పుడైనా అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసినా లేదా శిక్షణ పొందుతున్న యువత కూడా దరఖాస్తుకు అర్హులు కాదు.



రాముడి కోసం తపించి.. జీవించి...

- వనంలో వెలిగిన గొప్ప భక్తురాలు శబరి
- నేడు వినాయకపురంలో భద్రాద్రి రామయ్య కల్యాణం, స్మృతి యాత్ర
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు

భద్రాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్త శబరి స్మృతి యాత్రను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గురువారం రామాలయం ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణం, వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో రామయ్యకు అర్చన చేయనున్నారు.

2013లో ప్రారంభం

శబరి స్మృతి యాత్ర ఉత్సవానికి 2013లో అప్పటి స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్ అయిన వినోద్‌కుమార్ అగర్వాల్ శ్రీకారం చుట్టారు. అపర భక్తురాలి స్మృతిగా ఆశ్వీయుజ పూర్ణిమ నాడు శబరి స్మృతి యాత్ర పేరుతో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు గత 12 సార్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయంలో గిరిజన సంప్రదాయంతో ఏర్పాట్లను అధికారులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నాడు పది రకాల పుష్పాలు, ఫలాలతో స్వామికి సహస్ర నామార్చన సైతం నిర్వహించనున్నారు. ఉదయం మేళతాళాలు, గిరిజన తప్పెట్లతో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. అనంతరం నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించి నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి వివిధ పుష్ప, ఫలార్చన, మంత్ర పుష్పం నిర్వహించనున్నారు.

శబరి విగ్రహం ఏర్పాటు ఎప్పుడు?

రామునికి శబరిమాతకు విడదీయరాని అనుబంధం ఉంది. రాముని కోసం తన గురువుల ఆజ్ఞపై 13 సంవత్సరాలు శబరి తపస్సు చేసింది. తన ఆశ్రమానికి వచ్చిన రామలక్ష్మణులకు ఆతిథ్యమిచ్చిన ఓ సామాన్య గిరిజన మహిళ శబరి. యోగులకు, మునులకు కూడా దుర్లభమైన ముక్తిని పొందింది. అంతటి గొప్ప భక్తురాలైన శబరిమాత విగ్రహాన్ని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ఏర్పాటు చేయాలని రామ భక్తులు కోరుతున్నారు. భక్తరామదాసు, తూము నరసింహదాసు, పోకల దమ్మక్క, తానీషా విగ్రహాలను ఏర్పాటు చేసిన అధికారులు అదే రీతిలో భక్త శబరి విగ్రహం ఏర్పాటు చేస్తే సముచితంగా ఉంటుందనే భావన భక్తుల్లో వ్యక్తమవుతోంది.



ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేట మండలంలోని వినాయకపురంలో ఈసారి శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకోసం భద్రాచలం నుంచి స్వామివారి ప్రచార రథం వినాయకపురం చేరుకోనుండగా శోభయాత్రతో ముత్యాలమ్మతల్లి ఆలయం వద్దకు తీసుకెళ్లనున్నారు. ఆలయం వద్ద స్వామి వారి ప్రచార మూర్తులతో కల్యాణోత్సవం నిర్వహించడంతోపాటు స్వామి వారి అన్నప్రసాద వితరణ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే దేవస్థానం అధికారులు ప్రచారాన్ని సైతం

వినాయకపురంలో
సీతారాముల కల్యాణం

చేశామని పేర్కొంటున్నారు. స్వామి వారి పూజా కార్యక్రమాలు ముగిసిన తరువాత శబరి స్మృతి యాత్రలో పాల్గొన్న ప్రతి కుటుంబానికి శబరి, రామ లక్ష్మణులతో ఉన్న జ్ఞాపిక, లడ్డూ ప్రసాదం, పూజా కార్యక్రమానికి వినియోగించిన పుష్పాలను అందించనున్నారు. ఇదిలా ఉండగా కూనవరంలోని గోదావరి, శబరి సంగమం వద్ద సైతం భద్రాద్రి దేవస్థానం వైదిక సిబ్బంది శబరి స్మృతి యాత్ర రోజున ప్రత్యేక పూజలు, శబరిమాతకు ప్రత్యేక స్నపనం నిర్వహించనున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై కేసులు

- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

తిరుమలాయపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఫల్యాలపై ప్రశ్నించే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుందని ఇది సరైన పద్ధతికాదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. బుధవారం మండలంలోని జల్లేపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్నపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపగా ఆయన్ని తాతా మధు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతోందన్నారు. అధికారపార్టీ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలను అణిచివేయాలని చూస్తే భయపడేదిలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు కేసులు, జైలుకెళ్లడం సాధారణమని, తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన అనేకమందిపై ఆనాటి ప్రభుత్వం కేసులు పెట్టి జైలుకు పంపిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అనేక సంక్షేమపథకాలు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలవుతోందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎన్ని అమలుచేశారో చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో అమలుకాని వాగ్దానాలు ఇచ్చి వాటిని విస్మరించారని తెలిపారు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా రైతులు సాగుచేసిన పంటలు నీటమునిగాయని, వారికి నేటివరకు పరిహారం అందలేదన్నారు. రైతులకు రైతుబంధు పథకం ఊసేలేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న నాయకులు తమిర వెంకటరెడ్డి, కొండబాల వెంకటేశ్వర్లు, బోడ మంచానాయక్, బాషబోయిన శైలజ, పోట్ల జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

కొడుకును హత్య చేసిన తండ్రి

- ఘటన జరిగిన సమయంలో ఇద్దరూ మద్యం మత్తులోనే...
- నిద్రలో ఉండగా గొడ్డలితో దాడి
- అక్కడికక్కడే మృతి చెందిన కుమారుడు

ఖమ్మంక్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి.. నిద్రిస్తున్న కన్న కొడుకును హత్య చేసిన ఘటన మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగర శివారులోని రామన్నపేట కాలనీకి చెందిన కాంపల్లి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో చిన్నకుమారుడు కాంపల్లి గణేష్(30) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గణేష్‌కు ఐదేళ్ల క్రితం వివాహం జరగ్గా పెళ్లయిన నెలరోజులకే విడాకులయ్యాయి. అప్పటినుంచి గణేష్ మద్యానికి బానిసై ఇంట్లో తల్లిదండ్రులు, సోదరుడితో నిత్యం గొడవ పడుతున్నాడు.

ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి బాగా మద్యం తాగి ఇంటికి వచ్చిన గణేష్, అప్పటికే మద్యం మత్తులో ఉన్న తన తండ్రితో ఘర్షణకు దిగాడు. ఈ గొడవ తరువాత గణేష్ నిద్రిస్తుండగా మద్యం మత్తులో ఉన్న తండ్రి వెంకటేశ్వర్లు అర్ధరాత్రి పదునైన ఆయుధంతో గణేష్ నుదురు, చెవి భాగంలో బలంగా దాడిచేశాడు. తర్వాత అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన సమీప ఇంటివారు వెంకటేశ్వర్లు పెద్ద కుమారుడైన నాగేంద్రబాబుకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న నాగేంద్రబాబు పోలీసులకు సమాచారం అందించగా, వారు మృతదేహన్ని పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బుధవారం మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాగా, వెంకటేశ్వర్లు భార్య దసరా పండుగకు ముందే బంధువుల ఇంటికి వెళ్లింది. అలాగే పెద్ద కుమారుడు నాగేంద్రబాబు భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఘటన జరిగిన సమయంలో నాగేంద్రబాబుపై అంతస్తులో ఉండగా, కింద వెంకటేశ్వర్లు, గణేష్ మాత్రమే ఉన్నారు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య చోటుచేసుకున్న ఘర్షణ హత్యకు దారి తీసిఉండవచ్చని భావిస్తున్నారు. నిందితుడు హత్య చేసేందుకు గొడ్డలి ఉపయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



గణేష్ మృతదేహం

గంజాయి గుప్పు

(5వ పేజీ తరువాయి)

రంగారావుబంజర, టేకులపల్లికి చెందిన వారున్నారు. పోలీసులు గుర్తించిన మిగిలిన నిందితులను అదుపులోకి తీసుకుంటే ఇంకా ఎంతమంది గంజాయి బానిసలు ఉన్నారనే విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పోలీసు నిఘాతో పెద్ద మొత్తంలో గంజాయి విక్రయించేవారు తప్పించుకున్నారనే ప్రచారంలో ఉంది.

గంజాయి సమాచారం అందించండి
రఘు, కల్లూరు ఏసీపీ

గంజాయి విక్రయాలు, రవాణా, గంజాయి సేవనానికి సంబంధించి సమాచారాన్ని పోలీసులకు అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలి. మత్తు పదార్థాల విక్రయం, వాడకం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం.

గ్రహణం వీడని పరిహారం

- పరిహారం మంజూరైనా బ్యాంకు ఖాతాలకు జమకాని డబ్బులు
- 40 రోజులుగా కేఎంసీ చుట్టూ బాధితులు ప్రదక్షిణలు
- పరిష్కారం చూపని అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్నేరు ముంపు బాధితులకు యుద్ధప్రాతిపదికన వారం రోజుల్లోనే పరిహారం మంజూరు చేసినా కొంతమంది బాధితుల బ్యాంకు ఖాతాలకు మాత్రం పరిహారం చేరలేదు. సెప్టెంబరు 1న కురిసిన భారీ వర్షాలకు మున్నేరుకు 40 అడుగులకు పైగా వరద వ్యాపించింది. వరద వేగానికి మున్నేరు పరివాహకంలోని నివాసాలు కూడా ధ్వంసమైనాయి. కాగా పునరావాసం తర్వాత సర్వే జరిపిన అధికార యంత్రాంగా బాధితులను గుర్తించారు. వారి జాబితాలను నమోదు చేసి ఒక్కో బాధిత కుటుంబానికి రూ.16,500 చొప్పున బ్యాంకు ఖాతాలకు డబ్బులు మంజూరు చేశారు. కానీ బ్యాంకర్లతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు సమన్వయం చేసుకొలేక పోయారు. దీంతో 40 రోజులుగా పదుల సంఖ్యలో మున్నేరు పరివాహక ప్రాంతంలోని మోతీనగర్, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, ప్రకాశ్‌నగర్, ఇతర ప్రాంతాలకు చెందిన బాధితులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారు. ప్రభుత్వం డబ్బులు మంజూరు చేసిన వారి పేర్లను జాబితాల్లో చూపిస్తున్నారు.

అయితే అధికారులను కలిసేందుకు అవకాశం లేక పోవటంతో కార్యాలయంలోని సీసీ ల వద్దనే తమ గోడు చెప్పుకొని నిట్టూర్పుతో వెనుదిరుగుతున్నారు. ఇలా ప్రతి రోజు వచ్చే బాధితుల్లో 90శాతం వరకు వీధుల వెంట చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారే ఉంటున్నారు. ప్రతి రోజు తాము కార్యాలయానికి రావటం వల్ల జీవనోపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది గ్రామీణ, ప్రైవేట్ బ్యాంకు ఖాతాలు కలిగిన వారే ఉన్నారు. అధికారులు దయదాల్చి ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం తమ బ్యాంకు ఖాతాల్లో జమ జరిగేలా చూడాలని ప్రాధేయపడ్తున్నారు.



పరిహారం కోసం కేఎంసీకి వచ్చిన బాధితులు

ఆటవిడుపుగా అరటి సాగు

వైరా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఏడోవార్డు బ్రాహ్మణపల్లిలో ఓ రైతు తన ఇంటి ఖాళీ పెరట్లో ఆటవిడుపుగా అరటి తోట సాగుచేశారు. ఫలితంగా రెండు సంవత్సరాల నుంచి ఆయనకు వేలాదిరూపాయల ఆదాయం లభిస్తున్నది. పోటు మధుసూదన్‌రావు అనే రైతు రెండేళ్ల కిందట తన ఇంటి ముందు ఖాళీగా ఉన్న మూడుకుంటల స్థలంలో దాదాపు 150కుపైగా అరటి మొక్కలు వేశారు. ఇప్పటికే ఒక సీజన్ అరటిగెలలు కాపు వచ్చింది. ప్రస్తుతం రెండో సీజన్ అరటి గెలలు వచ్చాయి.

అరటి సాగులో నష్టపోయినప్పటికీ...

తనకున్న ఐదెకరాల భూమిలో మధుసూదన్‌రావు 8సంవత్సరాలు అరటి తోటలు సాగుచేశారు. అయితే చివరి సంవత్సరం ఆసాగులో ఆయనకు నష్టాలే మిగిలాయి. భూమిలోని అరటితోటను తొలగించిన మధుసూదన్‌రావు దానిలోని కొన్ని మొక్కలు తీసుకొని వచ్చి ఇంటి ముందు ఖాళీగా ఉన్న స్థలంలో వేశారు. అవి అనూహ్యంగా సాగుభూమిలో కంటే ఏపుగా పెరిగి గెలలు వేశాయి. మొదటి సీజన్‌లో ఈ అరటిగెలల నుంచి రూ.30వేలకుపైగా ఆదాయం వచ్చింది. ఇప్పుడు రెండో సీజన్‌లో కూడా మంచి కాపు కాసింది. ఇప్పుడు రూ.30వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశముందని మధుసూదన్‌రావు తెలిపారు. మొత్తంగా కేవలం ఒక బస్తా యూరియా మాత్రమే వేశానని, అవసరమైన నీటిని ఎప్పటికప్పుడు అందిస్తున్నానని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రకృతిపరంగా ఎంతో ఆహ్లాదంగా ఉంటుందని కూడా తెలిపారు.



రైతు మధుసూదన్



ఇంటిముందు ఖాళీ ప్రదేశంలో వేసిన అరటి తోట

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ రాష్ట్ర సభ్యత్వ సహ-కన్వీనర్ గోలి మధుసూధన్‌రెడ్డి

నేలకొండపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయక పోవటంతో తెలంగాణా ప్రజలు బీజేపీ వైపు మొగ్గుతున్నారని బీజేపీ రాష్ట్ర సభ్యత్వ సహ-కన్వీనర్, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించిన మధుసూధన్‌రెడ్డి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎన్నికలు జరిగిన కశ్మీర్, హర్యానాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్నదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు జిల్లాలో నష్టపోయిన రైతులు, ప్రజలకు ఇంతవరకు నష్ట పరిహారం చెల్లించక పోవటం దారుణమన్నారు. ఇంత వరకు రాష్ట్రంలో కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలను నింపుతూ, అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని, దీన్ని బీజేపీ సహించదని హెచ్చరించారు. కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలని, ఉద్యమాలు నిర్వహించాలని మధుసూధన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, ప్రధాన కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, గోవిందరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు మధుసూధన్‌రెడ్డి

గుండెపోటుతో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కె.శివప్రసాద్(58) బుధవారం మృతిచెందాడు. కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డ ఏరియాలో నివసిస్తున్న శివప్రసాద్ ఛాతీలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలుపగా ఓ ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్రకళాశాల వద్ద గల ఈవీఎం మెషిన్ల గోదాం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మున్నేరు వరద బాధితులను ఆదుకోవాలంటూ ధర్నా



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విపక్ష నేతలు

ఖమ్మంటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షనేతల ఆధ్వర్యంలో బుధవారం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకుడు నూనె శశిధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ మాట్లాడుతూ వరద ముంపు బాధితులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫ లం చెందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.16,500 పరిహారం ఇంకా వందలాది మందికి అందలేదన్నారు. తీవ్రంగా దెబ్బతిన్న ఇళ్లకు, పూర్తిగా నష్టపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3లక్షలు ఇవ్వటంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నదన్నారు. వరదతో నష్టపోయి నెలరోజులకు పైగా గడుస్తున్నా అధికారులు బాధితులందరికీ ఎందుకు నష్ట పరిహారం అందించలేదో జవాబు చెప్పాలన్నారు. ఇళ్లు దెబ్బతిని, సర్వం కోల్పోయిన బాధితుల పూర్తిస్థాయి లిస్టు తయారు చేయకుండా తూతూ మంత్రంగా నష్టపరిహారం అందించారని విమర్శించారు. ముగ్గురు మంత్రులున్నా, వరద బాధితుల సాయంపై సమీక్షలు నిర్వహించటం లేదని, ప్రత్యేక అధికారులను నియమించి పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పొలాలు నీటమునిగిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు.సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.విక్రం, యర్రా శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, సీపీఎం కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు రుద్రగాని శ్రీదేవి, రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన


మృతదేహంతో ఆందోళన చేస్తున్న బాధితులు

భద్రాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా భద్రాచలం హరిత హోటల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఈసంపల్లి నరసింహారావు(40) కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన నిర్వహించారు. భద్రాచలంలోని హరితహోటల్ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు మృతదేహంతో బైఠాయించగా దళిత సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. మూడు నెలల క్రితం నరసింహారావును అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించడంతో మనస్థాపంతో మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా మృతి చెందిన నరసింహారావు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని సీఐటీయూ నాయకులు సైతం డిమాండ్ చేశారు. తన భర్త మృతికి కారణకులపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య లలిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

దుమ్ముగూడెం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి సీతారాంపురంలో ఏకలవ్య మోడల్ పాఠశాల నిర్మాణ పనుల్లో బుధవారం విద్యు దాఘాతానికి లోనైన కార్మికుడు ఒకరు మృతి చెందాడు. బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లాకు చెందిన వికాస్ కుమార్(27) నిర్మాణ ప్రాంగణంలోని తన గదిలో విద్యుత్ సరఫరా పనులు చేస్తున్న క్రమంలో విద్యుదఘాతానికి లోనయ్యా డు. భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వారు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుడు తన భార్యతో కలిసి రెండేళ్లుగా అక్కడ పనిచేస్తున్నాడు. పేద కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు రావులపల్లి రవికుమార్, బొల్లోజు వేణు డిమాండ్ చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


పవన్ మృతదేహం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తురకల గూడేనికి చెందిన పొట్ట పవన్ (27)కు ఐదేళ్ల క్రితం కిష్టారం గ్రామానికి చెందిన గోపికృష్ణతో ప్రేమ వివాహం జరిగ్గా వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్య పుట్టింటికే పరిమితం కావడంతో కుటుంబ కలహాల నేపథ్యంలో పవన్ పురుగుల మందు సేవించాడు. 108లో సత్తుపల్లికి తీసుకు వస్తుండగా మార్గమధ్యలో మృతి చెందగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన శివకుమార్

కొణిజర్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొణిజర్ల-పల్లిపాడు గ్రామాల మధ్య ప్రధానరహదారిపై ఏర్పడిన గుంతల్లో ద్విచక్ర వాహనం పడి వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన చల్లా శివకుమార్ ద్విచక్రవాహనంపై వైరా వెళ్తుండగా మార్గమధ్యలో కొణిజర్ల, పల్లిపా డు మధ్య ఏర్పడిన గుంతల్లో ద్విచక్రవా హనం పడి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్ రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే ఖమ్మం తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపటంతో హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పేరువంచ సమీపాన చైతన్యనగ ర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది బాటసారులు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని చైతన్యనగర్ వద్ద ప్రధాన రహదారి పక్కన వెళ్తున్న ఎనిమిది మంది బాటసారులను తిరువూరు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీ కొనగా వారికి గాయాలైనాయి. అందులో మంచాల చిన్ననరసయ్య పరిస్థితి విషమంగా ఉంది. నరసమ్మలకకు తలకు బలమైన గాయాలు కావటంతో ముందుగా కల్లూరు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. తీవ్రంగా గాపడిన ఇద్దరిని ఖమ్మం తరలించారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షాకీర్ తెలిపారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

- ప్రైవేట్ పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టగా తల్లిదండ్రులు ఆందోళన చేసిన సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని గొల్లగూడెం ప్రాంతంలో ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినిపై ఉపాధ్యాయుడు సతీష్ హోమ్ వర్క్ చేయలేదని విచక్షణ రహితంగా కొట్టాడు. ఈ విషయం ఆ విద్యార్థి తల్లిదండ్రులకు తెలుపగా వారు పాఠశాల వద్ద ఆందోళనలు చేశారు. స్థానికులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఉపాధ్యాయుడు సతీష్‌ను అదుపులోకి తీసుకొని త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులతో మాట్లాడి ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు. అయితే ఉపాధ్యాయుడు సతీష్ విద్యార్థిని చితక బాదుతున్న దృశ్యాలు అదే పాఠశాల సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇవి కాస్త సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టాయి. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు తల్లిదండ్రులు వద్ద నుంచి రాలేదని త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

ఓబీ కార్మికులందరికీ లాభాల బోనస్ వర్తింపచేయాలి


మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు సురేందర్

టేకులపల్లి, అక్టోబరు 16 (ఆంధజ్యోతి): ఎలాంటి ఆంక్షలు లేకుండా సింగరేణి ప్రకటించిన లాభాల బోనస్ రూ.5వేలు ఓబీ కార్మికులందరికీ వర్తింపచేయాలని జేఏసీ మండల కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు, నాయకులు భూక్యా దళ్‌సింగ్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, హర్షాలు డిమాండు చేశారు. ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ అధ్యక్షతన కేవోసీలోని ఎల్ఎస్ఎన్ కంపెనీ వద్ద బుధవారం జరిగిన ఓబీ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు ఎన్నో ఉద్యమాల తర్వాత లాభాల బోనసు సాధించుకొంటే కోయగూడెం ఓసీలో ఓబీ పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీ లాభాల బోనస్ చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేవోసీలో 350మంది ఓబీ కార్మికులకు 160 మంది కార్మికులకు మాత్రమే లాభాల బోనస్ ఇచ్చిందని మిగతా కార్మికులను విస్మరించిందన్నారు. ముందుగా ఎవరికి కూడ లాభాల బోనసు ఇవ్వలేదని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆందళనల ఫలితంగా 160 మందికి బోనసు ఇచ్చారన్నారు. మిగతా ఓబీ కార్మికులకు కూడ బోనసు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఇఫ్టూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, యాకూబ్ షావలీ, రామ్‌సింగ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాయం వెంకన్న, సుందర్, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు 'కుటుంబ భరోసా'

- ఫొటో గ్రాఫర్ చనిపోతే కుటుంబానికి ఆసరా
- మూడేళ్ల క్రితం ఏర్పాటు
- ప్రభుత్వ తోడ్పాటు కోసం ఎదురుచూపు


మృతిచెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న సభ్యులు(ఫైల్)

పెనుబల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అందమైన ఫొటోలు తీసి ఎదుటివారిని ఆనందపరిచే వృత్తిలో ఉన్న ఫొటోగ్రాఫర్ల కుటుంబాల వారు ఏదైనా ప్రమాదంలో అర్ధాంతరంగా చనువు చాలిస్తే వారి పరిస్థితి దయనీయంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎవరో వస్తారని... ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.హుస్సేన్ ఆధ్వర్యంలో ఆ సంఘం కుటుంబ భరోసా పథకాన్ని మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ తోడ్పాటు లేకుండానే ఫొటోగ్రాఫర్లను ఆదుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఫొటోగ్రాఫర్ చనిపోయినా ప్రతి ఫొటోగ్రాఫర్ రూ.పది అందజేసే పథకాన్ని అమలుచేస్తూ సుమారు వందకుపైగా కుటుంబాల్లో వెలుగులు నింపి ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కుటుంబ భరోసా పథకం..

ఫొటోగ్రాఫర్లు తమ కుటుంబాలను తామే ఆదుకొనేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆలోచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న యూనియన్ జిల్లా, మండల నాయకుల సహకారంతో సుమారు మూడేళ్లుగా కుటుంబ భరోసా పథకం దిగ్విజయంగా అమలుజరుగుతుంది. హఠాత్తుగా మృతిచెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30వేలమంది ఫొటోగ్రాఫర్లు తలా పదిరూపాయలు అందజేయడం ద్వా రా వారి కుటుంబాలకు ఈ నగదు ఎంతో తో డ్పాటునందిస్తుండటంతో ఫొటోగ్రాఫర్లు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగానే ఉండే ఫొటోగ్రాఫర్లకు హఠాత్తు మ రణాలు వారి జీవనశైలి చిన్నాభిన్నమవుతున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోయినా...

ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందని పరిస్థితుల్లో ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు ఏదైనా సహకారం అందించాలని తోటి ఫొటోగ్రాఫర్లతో చర్చించి మనతో పాటు ఉండి మనలో ఒకరిగా ఉన్న ఫొటోగ్రాఫర్ మృతిచెందిన సందర్భంలో ఒక్కొక్కరం కేవలం పదిరూపాయలు ఇస్తే వారికి కొంతైనా ఆర్థిక వెసులుబాటు ఉంటుందని చర్చించి ఈ కుటుంబ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటికే 106 మందికి ఒక్కొక్కరికి రూ.1.60లక్షల సహాయాన్ని అందించారు.

మహిళా పొటోగ్రాఫర్లకు కూడా...

కుటుంబ భరోసా పథకంలో కేవలం పురుష ఫొటోగ్రాఫర్లకే కాకుండా మహిళా ఫొటోగ్రాఫర్లకు కూడా ఈ పథకంలో సభ్యులుగా చేర్చుకోవడంతో ఆయా సంఘాలు మరింత బలోపేతమై వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వ సహకారం ఉంటే ఉపయోగం

షేక్.హుస్సేన్, రాష్ట్ర అధ్యక్షుడు



ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ద్వారా నిర్వహిస్తున్న కుటుంబ భరోసా పథకానికి తాము అందించే నగదుకు ప్రభుత్వం కూడా సహకారం అందిస్తే చనిపోయిన ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు మరింత ఆసరాగా నిలుస్తుంది. ప్రభుత్వం సహకారాలు అందించాలి.

రేపు అండర్ -17 బాల బాలికల టేబుల్ టెన్నిస్ ఎంపికలు

చుంచుపల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-17 బాల, బాలిక ల టేబుల్ టెన్నిస్ ఎంపికలు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారని ఉమ్మడి జిల్లాల డీఈవోలు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరచారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతూ 1-1-2008 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్క్ మెమో, ఫోటోతో కూడిన ఎలిజిబిలిటీ ఫామ్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. ధృవీకరణ పత్రములు తీసుకొని రాని వారిని ఎంపికలకు అనుమతించరని ఉమ్మ డి జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులుడు వాసిరెడ్డి నరేష్‌కుమార్, నరసింహమూర్తి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు అందరూ కూడా ఈ నియమ నిబంధ నలు పాటిస్తూ క్రీడాకారులు సకాలంలో హాజరు అయ్యేలా చూడాలని కోరారు. వివరాలకు వి.నరేష్‌కుమార్ -99512 74678, నరసింహమూర్తి - 7989731339, సాంబమూర్తి- 9848408335, ప్రేమ్‌కుమార్- 9949446551లో సంప్రదించాలన్నారు.

సింగరేణి ఉద్యోగి మాన్వితకు షాట్‌పుట్‌లో రజతం



చుంచుపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్ మీట్ 2024లో షార్ట్ పుట్ విభాగంలో చుంచుపల్లి మండలానికి చెందిన మాన్వితకు రజత పతకం బుధవారం వరించింది. ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజ్‌లో నిర్వహిస్తున్న అథ్లెటిక్ పోటీల్లో కె.మాన్విత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటింది. సింగరేణి సంస్థల్లో ఉద్యోగి అయిన మాన్విత పబ్లిక్ సెక్టార్‌లో వ్యక్తిగత విభాగంలో రజత పతకాన్ని సాధించింది. ప్రస్తుతం కొత్త గూడెం కార్పొరేట్ లోని ఎస్టేట్ విభాగంలో ఉద్యోగిగా మాన్విత విధులు నిర్వహిస్తుంది. మాన్వితకు భద్రాద్రి జిల్లా వివిధ క్రీడా అసోసియేషన్, సింగరేణి వాసులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు నిరుపేదలను ఎంపిక చేయాలి

- మంత్రి పొంగులేటి
- ఖమ్మంరూరల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలైన లబ్ధిదారులను మాత్రమే ఎంపికచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన సమస్యలపై సమీక్షించారు. ఆయాగ్రామాల్లో సమస్యలపై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకరాగా వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పూర్తవుతున్న నేపథ్యంలో మొదటి విడతలో రాజకీయాలకు అతీతంగా ఎట్టిపరిస్థితుల్లో నిరుపేదలకు ఇళ్ల మంజూరు చేయాలని, అనర్హులకు కేటాయిస్తే చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు అన్నిటినీ పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో పర్యటనలో వచ్చిన సమయంలో వచ్చిన ప్రతిదరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తుందని తెలిపారు. రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.13వేల కోట్ల రుణమాఫీ త్వరలోనే చేస్తామని తెలిపారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామన్నారు. బయటి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో గణేష్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ సురేష్, ఎంఈవో శ్రీనివాసరావు, ఇంకా పలు శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో న్యూఇరా విద్యార్థి సత్తా


విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు హైదరాబాద్‌లో నిర్వహించిన ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ ఇండియా స్కేట్ 2024లో నగరంలోని న్యూఇరా పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న వివాన్ శ్రేయస్ అండర్ 7-9 క్యాటగిరి 1000, 500 మీటర్లలో ప్రతిభ కనపరచారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసిఏషన్‌లో ప్రతిభ కనపరచి మూడు గోల్డ్ మెడల్స్ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ ఆఫ్ ఇండియాలో పాల్గొని రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకొని ఆర్ఎస్ఎఫ్ఐ అసోషియేషన్ నిర్వహించే రోలర్ స్కేటింగ్ లో జాతీయ స్థాయిలో ఎంపికయ్యాడు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయస్సు లోనే క్రీడలలో ప్రతిభ కనబరచిన శ్రేయస్‌ను అభినందించారు.

విద్యా సమస్యలపై ఖమ్మం కేంద్రంగా ఉద్యమాలు

- పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- ఖమ్మంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- పాల్గొన్న విద్యాసంస్థల యాజమన్యాలు, వామపక్ష విద్యార్థి సంఘాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గత ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలో పెరిగిపోయాయని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి స్థాయిలోనే నిర్ణయాలు తీసుకోవాలని లేకుంటే ఖమ్మం జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు పిలుపునిస్తామని వక్తలు హెచ్చరించారు. బుధవారం ఖమ్మం రామనర్స య్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డిగ్రీ, పీజీ విద్యా సంస్థల యాజమాన్య జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, ఆర్‌జేసీ కృష్ణ, వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ మూడేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్ రూ.2500 కోట్లు, ఫీజు రియంబర్స్‌మెంట్ రూ.4 వేల కోట్లు బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే మూడు రోజులు పాటు విద్యా సంస్థలు బంద్ చేస్తామని హెచ్చరించారు. విద్యా సంస్థల నిర్వాహకులు కోట అప్పిరెడ్డి, మోహన్‌రెడ్డి, కిరణ్‌శౌరి, నవీన్, బొమ్మ సత్యప్రసాద్, డేర్ కిరణ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు ఇటికాల రామకృష్ణ, ఆజాద్, లక్ష్మణ్, వెంకటేష్, సుధాకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన బుధవారం మండలంలోని బుగ్గపాడులో చోటుచేసుకుంది. మూల మలుపు వద్దకు రాగానే అదుపుతప్పడంతో కాలువలోకి దూసుకెళ్లగా ఆ సమయంలో ఇద్దరు మహిళలు, ఓ యువకుడు ప్రయాణిస్తుండగా ఎవరికీ ఏమీ కాలేదు. ప్రమాదానికి గురైన కారును జేసీబీ సహాయంతో బయటకు తీశారు.

ముగిసిన కోటమైసమ్మతల్లి జాతర

నేడు ఆలయంలో హుండీ లెక్కింపు



కారేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో ఈనెల 12నుంచి ప్రారంభమై బుధవారం వరకు ఐదు రోజులపాటు జరిగిన కోటమైసమ్మతల్లి జాతర ఘనంగా ముగిసింది. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సాపట్టాబి రామారావు, ఈవో వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఐదు రోజుల జాతర విజయవంతంగా సాగింది. జాతరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలనుంచే కాకుండా పరిసర ప్రాంతాలకు చెందిన మూడులక్షలమందికి పైగ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. జాతర ఏర్పాటుచేసిన పలు హుండీలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హుండీలను గురువారం ఆలయంలో భారీ బందోబస్తు నడుమా లెక్కింపు జరుగుందని ఆలయ నిర్వహకులు తెలిపారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

- తొలి రోజు 481 మంది చేరిక
- ఇంకా చేరని 35మంది
- తొలిరోజే పాఠాలు బోధన


పాఠాలు బోధిస్తున్న కొత్త ఉపాధ్యాయురాలు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాల లకు కేటాయించిన నూతన ఉపాధ్యాయులు బుధవారం విధులలో చేరారు. వీరికి ఆయా మం డల వనరుల కేంద్రాల్లో ఉపాధ్యాయ సంఘాలు సేవలు అందించాయి. 1998 తర్వాత భారీ స్థాయిలో ఎంపికలు జరగడం, 20 సంవత్సరాల తర్వాత మైదాన ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతం అనే తేడా లేకుండా నియామకాలు జర గడం వల్ల అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చి కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఏర్పడింది. కొంతమంది ఉపాధ్యాయులు వివిధ ఉద్యోగాలు చేస్తున్నందున రిలీవై రావాల్సి ఉన్న నేపథ్యంలో బుధవారం జాయిన్ కాలేదు. నూతనంగా పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు బుధవారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకొని నియామక పత్రాలను సంబంధిత ప్రధానోపాధ్యా యులకు అందించారు. ముందుగా ఆయా మండల విద్యాశాఖ అధికారులకు రిపోర్ట్ చేసిన అనంతరం పాఠశాలలకు చేరుకున్నారు. నూతన ఉపాధ్యాయులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపి స్వాగతం పలికారు. బుధవారం రిపోర్ట్ చేయని ఉపాధ్యాయులకు ఈనెల 24 వరకు వారికి అవకాశం ఉన్నది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 481 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారని, ఇంకా 35 మంది చేరాల్సి ఉందని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు.ఇంత తక్కువ సమయంలో భారీ స్థాయిలో నియామకాలు జరగటం ఆనందించదగ్గ విషయమని టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్‌టీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా కమిటీలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాయి.

అన్నదాన మండపానికి భూమిపూజ



ఖమ్మంసాంస్కృతికం,అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పంపింగ్‌వెల్‌రోడ్‌లో ఏర్పాటు చేయనున్న హరిహరసుత అయ్యప్ప అన్నదాన మండపానికి బుధవారం భూమిపూజ చేశారు. నవంబరు3 నుంచి డిసెంబరు 13 వరకు 41 రోజుల పాటు అయ్యప్ప మాల ధరించిన దీక్షా పరులకు అన్నప్రసాద వితరణ చేస్తామని ట్రస్టు చైర్మన్ పల్లెపు ఉపేందర్‌స్వామి చెప్పారు.

ఆర్టీసీ సేవల నంబర్లు

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370


రైతుబజార్ కూరగాయల ధరలు

టమాటా	రూ. 58	క్యాబేజీ	రూ. 34
వంకాయ	రూ. 44	దొండ	రూ. 34-40
బీరకాయ	రూ. 40	సొరకాయ	రూ. 30
పచ్చిమిర్చి	రూ. 48	క్యారెట్	రూ. 64
కాకరకాయ	రూ. 34	క్యాప్సికం	రూ.90
బెండకాయ	రూ. 34	ఆలుగడ్డ	రూ. 40
పొట్లకాయ	రూ.48	ఉల్లిగడ్డ	రూ. 50-60
దోసకాయ	రూ. 50-54	కోడిగుడ్లట్రే(30గుడ్లు)	రూ.160- 165
గోరుచిక్కుడు	రూ. 48	కొత్తిమీర కట్ట	రూ. 40



ఉచిత మూత్రశాలలకు.. పైసావసూల్

- కొత్తబస్టాండ్‌లో రోజుకు రూ.3నుంచి 5వేల ఆదాయం
- గతంలో విజిలెన్స్ తనిఖీలు.. జరిమానా విధింపు
- అయినా తీరుమారని మూత్రశాల నిర్వాహకులు
- డబ్బులు ఇవ్వకపోతే ప్రయాణికులపై దౌర్జన్యం



ప్రయాణికుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న మూత్రశాల నిర్వాహకుడు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత మూత్రశాల వద్ద నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమి ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. వృద్ధులు, పిల్లలపై దూషణలకు దిగుతున్నారు. ఖమ్మంకొత్త బస్టాండ్‌కు వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా దూరప్రాంతాల ప్రయాణికులే వస్తుంటారు. వీరు మూత్రశాలలకు వెళితే నిర్వాహకులు ఒక్కోకరి వద్ద నుంచి రూ. 5 నుంచి రూ.10 వరకు వసూసూ చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

గతంలో జరిమానా విధించినా

నగదు వసూలుపై గతంలో విజిలెన్స్ తనిఖీ నిర్వహించారు. నిర్వాహకులను హెచ్చరించారు. జరిమానా విధించారు. ఐనప్పటికీ వారు తీరు మార్చుకోలేదు. నిర్వాహకులు పైసా వసూల్ చేస్తూనే ఉన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్‌లో రెండువైపులా మూత్రశాలలను ఏర్పాటు చేశారు. దీనిని టెండర్ తీసుకొన్న వ్యక్తులు ప్రయాణికుల వద్ద పైసావసూళ్లే లక్ష్యంగా జేబులు నింపుకొంటున్నారు. ఉచితంగా అందా ల్సిన సేవలకు పైసలు వసూల్ చేస్తున్నా ఆ నిర్వాహడిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవటం లేదు.

పైసల్ కట్టాల్సిందే

మూత్రశాలలు ఉపయోగించిన ప్రతీ ఒక్కరు పైసల్ కట్టాల్సిందేనంటూ నిర్వాహకుల ప్రయాణికులపై దౌర్జన్యం చేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. బతుకమ్మ, దసర పండుగ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల రద్దీపై, అదనపు బస్సులపై దృష్టి పెట్టటంతో మూత్రశాల నిర్వాహకుడు ఇదే అదనుగా మూత్రశాలలకు పైసల్ వసూళ్లకు పాల్పడుతున్నాడని పలువురు ప్రయాణికులు చెప్పారు. మూత్రశాలల నిర్వాహకులపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

రోజుకు రూ.3నుంచి 5 వేల ఆదాయం

నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో మూత్రశాల నిర్వాహకులకు రోజుకు 3నుంచి 5 వేల వరకు ఆదాయం వసూలు చేస్తున్నారు. దీనిపై కొందరు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఐనప్పటికీ వారిలో మార్పు రాలేదు. కొందరు విద్యార్థులు, వద్ధుల వద్ద పైసలు లేని సమయాలలో వారిపై నిర్వాహకులు అసభ్యపదజాలంతో మాట్లాడిన సంఘటనలు ఉన్నాయని తెలుస్తోంది. కేవలం మరుగుదొడ్డికే ఐదు రూపాయలు వసూలు చేయ్యాల్సిన నిర్వాహకులు మూత్రశాలలకు కూడా పైసలు వసూలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చందాకు ఘన నివాళులు

రఘునాథపాలెం, అక్టోబరు16,(ఆంధ్రజ్యోతి): వీవీపాలెంలో ఇటీవల కన్నుమూసిన బాణోత్ చందాకు పలువురు నాయకులు ప్రజాప్రతినిదులు బుధవారం ఘన నివాళులు అర్పించారు. బాణోత్ చందా కుమారుడు బాణోత్ కిమా ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్‌గా పనిచేశారు. మృతుని కుటుంబ సభ్యులను ఏఎంసీ మాజీ డైరెక్టర్ కుతుంబాక నరేశ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తొలపనూరి దానయ్య, వద్దబోయిన కొదండరాములు, మాజీ ఉపసర్పంచి బానోత్ లాల్‌సింగ్, కూరాకుల సత్యం తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

- ఆకస్మిక నిర్ణయంతో చర్చ
- ఓ కార్మిక సంఘం నేత విషయంలో అభాసుపాలు
- కార్మికులపై పర్యవేక్షణ లేక వారి మధ్య గొడవలు



ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు మధిర మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. మధిర కమిషనర్‌ను కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా నియామకం చేశారు. అయితే కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ఆకస్మిక బదిలీపై ఖమ్మం నగర పాలక సంస్థలో చర్చ జరుగుతోంది. మున్నేరు వరద సమయంలో ఆయన ఎంతో కీలకంగా బాధ్యతలు నిర్వహించారు. వరదల తర్వాత పారిశుధ్య కార్యక్రమాలు త్వరగా నిర్వహించటంలోను తనదైన ముద్ర చూపించారు. కాగా సుదూర ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తుంటారని, ఓ కార్మిక సంఘానికి చెందిన నాయకుడు విషయంలోనే అసిస్టెంట్ కమిషనర్ ఆబాసుపాలైనట్లు తెలుస్తోంది. పారిశుధ్య కార్మికుల మార్పు విషయంలోను కేఎంపీ పాలకవర్గానికి, స్థానిక కార్పొరేటర్ల అనుమతి లేకుండా ఆ నాయకుడు చెప్పిన వారిని కేటాయించారని విమర్శలు వెలువడుతున్నాయి. కొంతకాలంగా పారిశుధ్య కార్మికులపై పర్యవేక్షణ తగ్గటంతో వారు దాడి చేసుకునే పరిస్థితి వరకు వెళ్లింది. ఇది ఖమ్మం నగర పాలక సంస్థ అప్రతిష్టకు దారితీసింది. పారిశుధ్య, స్వచ్ఛభారత్ వాహనాలు చెత్తను డంపింగ్ సమయంలో డంపింగ్‌యార్డులోని రహదారుల పైనే చెత్తను వేయటంతో డంపింగ్ సమస్య ఏర్పడినట్లుగా విమర్శలు వెలువడ్డాయి.

స్వయం సహాయక సంఘాల బలోపేతం

రుణాలు పొందిన సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు షురూ

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిర మహిళాశక్తిలో భాగంగా రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులను ఆన్‌లైన్ చేసేందుకు కేఎంసీలో ప్రక్రియను షురూ చేశారు. మూడు రోజులుగా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో రుణాలు పొందిన సభ్యుల వివరాలు, వారు చేస్తున్న వ్యాపారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర మెప్మా పరిధిలో 377 యూనిట్లు టార్గెట్ కాగా వాటిలో 250 యూనిట్లు పూర్తి జరిగాయి. ఖమ్మం నగర పాలక సంస్థలో 60 డివిజన్లుండగా వాటిలో 162 మంది రిసోర్స్ పర్సనలు పనిచేస్తున్నారు. వీరి ద్వారా 4,500 మహిళా సంఘాల నిర్వాహణ జరుగుతుంది. కాగా కేఎంసీ పరిధిలో మొత్తం ఇందిర మహిళా శక్తిలో బాగంగా 271 యూనిట్లు ఏర్పాటుకు ప్రభుత్వం టార్గెట్ ఇవ్వగా ఇప్పటికే 173 యూనిట్లు పూర్తి చేశారు. ఆన్‌లైన్ నమోదు జరిగిన మహిళా స్వయం సహాయక సంఘాలకు రెగ్యూలర్‌గా వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం నైపుణ్యత శిక్షణతో పాటుగా వ్యాపార పరికరాలు, వస్తువులను అందించి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా ఆర్థికాభివృద్ధికి కార్యచరణ ప్రారంభమైంది.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి

- డీడబ్ల్యూఓ రామ్ గోపాల్‌రెడ్డి

కామేపల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందించాలని డీడబ్ల్యూఓ రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చాకలిమాన్యం తండ పాథమిక పాఠశాలను, కొమ్మినేపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆతరువాత ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రీస్కూల అటెండెన్స్ మార్నింగ్ స్నాక్స్ సామ్, మామ్ పిల్లల హెల్త్ చెకప్ తదితర విషయాలను సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో బుధవారం ఎంబీఏ, ఎంసీఏ ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రణాళికబద్ధమైన, నైపుణ్యాభివృద్ధిగల విద్యాతోనే సరైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, అందుకు తగినట్టుగానే బోధన పద్ధతులు, శిక్షణ కార్యక్రమాలు ఎస్‌బీఐటీలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరి కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో వనమహోత్సవం



వనమహోత్సవం ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం నినర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజ హాజరై కార్యక్రమం ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ, పాల్గొన్నారు.

మమతలో వరల్డ్ ఎండోడోంటిక్ డే

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎండోడోంటిక్స్ దినోత్సవాన్ని మమత దంత వైద్య కళాశాల, డిపార్ట్మెంట్ అఫ్ కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడోంటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంటి సమస్యలు వాటి పరిష్కారాలు వంటి విషయాల మీద రోగులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, రోగులను ఎండోడోంటిక్ చికిత్సల మీద సర్వే నిర్వహించారు

మ్యాథ్స్ ప్రీమియర్ లీగ్‌లో

హార్వెస్ట్ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మ్యాథ్స్ ప్రీమియర్ లీగ్ జాతీయస్థాయిలో అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన పోటీల్లో నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం బుధవారం తెలిపారు. ట్రాన్సిషన్ లాబ్ ప్రోబ్ స్కూల్ వారి ఆధ్వర్యంలో అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ వారు సెప్టెంబరులో ఆన్లైన్లో 9,10,11,12 తరగతుల విద్యార్థులకు పోటీలనునిర్వహించారన్నారు. దీనిలో దేశవ్యాప్తంగా 64 టీమ్లు పాల్గొనగా, ఒక్కొక్క టీంలో 8మంది విద్యార్థులు పాల్గొనగా, 5 రౌండ్లుగా నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీలలో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు కె.రిషిత్, ఎస్.రిష్యేంద్రమణి, వేదవిఖ్యాత్, రియాన్ అరాఫత్, టి.శ్రిజిత్, సాయి అక్షిత్, భువన్, సాయిరాం ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణమని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి, ఫౌండేషన్ ఇంచార్జ్ జి. ఉమామహేశ్వరరావు అభినందించారు.

ఓవరాల్ చాంపియన్ తిరుమలాయపాలెం స్కూల్



బహుమతులు అందిస్తున్న ఎంఈవో

తిరుమలాయపాలెం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కూసుమంచి, ముదిగొండ మండలాల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ క్రీడా పోటీల్లో తిరుమలాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. అండర్ 17 బాలుర కబడ్డీలో మొదటి విజేతగా నిలిచింది. సీనియర్ బాలుర ఖోఖోలో ద్వితీయ సీనియర్ బాలికల విభాగంలో వాలీబాల్‌లో తిరుగులేని విజేతగా నిలిచింది. అండర్ 14జూనియర్ బాలురలో ఖోఖోలో సైతం విజేతగా నిలిచింది. జోనల్ నుంచి జిల్లా స్థాయి ఖోఖోలో సైతం రన్నర్‌గా నిలిచి తిరుమలాయపాలెం జట్టు అందరిని ఆకట్టుకుంది. ఈసందర్భంగా బుధవారం గెలుపొందిన వారికి మండల అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, తిరుమలాయపాలెం స్పెషలాఫీసర్ ఎస్.సీతారాంరెడ్డి, ఉపాధ్యాయులు గంగా ప్రసాద్, సైదులు, పాపారావు, సుజాత, కవిత, రాజేశ్వరి, అలివేలు పాల్గొన్నారు

ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

- మేయర్ పునుకొల్లు, సొసైటీ అధ్యక్షుడు రావూరి
- అల్లీపురంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, సొసైటీ అధ్యక్షుడు రావూరి

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు16: కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులే రాజులుగా మారే వ్యవసాయ విధానాలను వ్యవయసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యచరణ చేస్తున్నారని, రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని మేయర్ పునుకొల్లు నీరజ, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు పేర్కొన్నారు. వీవీపాలెం సొసైటీ పరిధిలోని అల్లీపురంలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటుగా రైతు రుణ మాఫీ, రైతుబీమా, వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ధాన్యం అమ్మకాలు సందర్భంగా దళారుల ప్రమేయం లేకుండానే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. స్థానిక కార్పొరేటర్ రావూరి కరుణ, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రావెళ్ల శ్రీనివాసరావు, మేప్మా పీడీ మహేందర్ పాల్గొన్నారు. పీఏసీఎస్ కార్యదర్శి ఐతగాని తిరుపతిరావు, డైరెక్టర్ గుండే ఆదినారాయణ రైతులు నరేశ్, సంక్రాంతి నాగేశ్వరరావు, సామినేని నాగేశ్వరరావు, ముప్పారపు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. 45,49వ డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపనలు చేశారు.

ఏఈగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌రావు

ఖమ్మంరూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని ఏదులాపురం సబ్‌డివిజన్ మద్దుల పల్లిలోని కోతులగుట్ట సబ్‌స్టేషన్ ఏఈగా జిల్లా ప్రభాకర్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో బాగంగా టౌన్5 నుంచి రూరల్‌కు రావడం జరిగింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కాంత్రి సింహ ఖమ్మం1 టౌన్‌కు బదిలీ అయ్యారు.

వరద బాధితులను ఆదుకోవాలి: సీపీఎం

ఖమ్మంరూరల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరద కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండలంలోని జలగం నగర్, పెద్దతండా, నాయుడుపేట, రాజీవ్ గృహకల్ప, వికలాంగులకాలనీ, వాల్యాతండా, కస్నాతండా, తదితర ప్రాంతాలు వరద ముంపునకు గురై ప్రజలు సర్వం కోల్పోయారన్నారు. తనగంపాడు, కస్నాతండా, వాల్యాతండా, తదితర గ్రామాల్లోని బాధితులకు నేటికి ప్రభుత్వం అందించే నష్టపరిహారం రూ.16000 అందలేదన్నారు. వెంటనే ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్ సంపత్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. వెంటనే ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, మోహన్‌రావు, నందిగామకృష్ణ, నాగేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బురద నీళ్లలో నడుస్తున్న విద్యార్థులు

బడికి వెళ్లేదెలా...

చెరువును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

చింతకాని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణ ఎదురుగా ఉన్న ఆర్ అండ్‌బీ రహదారిపై నీళ్లు నిలిచి చెరువును తలపిస్తుంది. పాఠశాలకు ఎదురుగా నిలిచి ఉన్న బురద నీటిలోనే విద్యార్థులు నడిచి బురద కాళ్లతో తరగతి గదిల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి. బురద నీటిలో విద్యార్థులు జారిపడిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రయాణికులకు తప్పని కష్టాలు

వైరా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని ప్రధాన రహదారుల్లో భారీ గుంతలు, ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వైరా-స్టేజీ పినపాక మధ్య జాతీయ ప్రధాన రహదారి పైన అడుగు నుంచి రెండు అడుగుల లోతులో గుంతలేర్పడ్డాయి. అలాగే వైరా-జగ్గయ్యపేట, మధిర ఆర్‌అండ్‌బీ రోడ్డు మొత్తం కూడా గుంతల మయంగా తయారైంది. పాలడుగు వరకు దాదాపు 14కిలోమీటర్లు ఈ రోడ్డు గుంతలమయంగా ఉంది. పలు గ్రామాల్లో చెట్లు మొదలుతో సహా ఒరిగిపోయి ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన వైరా-మధిర రోడ్డు



పెద్ద బీరవల్లి పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్

పాఠశాలలో కిచెన్ గార్డెన్

బోనకల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బీరవల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కృషితో కిచెన్ గార్డెన్ నిర్వహణ ఆదర్శంగా ఉంది. పాఠశాల ఆవరణలో స్థలం ఎక్కువగా ఉండటంతో దాంట్లో కూరగాయాల మొక్కలను పెంచాలన్న ఆలోచన చేశారు. దీని కోసం ప్రత్యేకంగా ఫెన్సింగ్ వేసి తోటకూర, పాలకూర, మెంతుకూర, గొంగూర, కూరగాయలతో మధ్యాహ్న బోజనానికి అందిస్తున్నారు. ఉపాధ్యాయులు జల్లా సత్యనారాయణ, గుగులోతు రామకృష్ణ, మండేపుడి నరేష్‌లను పలువురు అభినందిస్తున్నారు.

మధిర మునిసిపల్ కమిషనర్ బదిలీ

మధిరటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపల్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లాను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వికారాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న షఫీఉల్లాను ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా మధిర మునిసిపల్ కమిషనర్‌గా గత ఫిబ్రవరిలో బదిలీ చేసింది. కాగా డిప్యూటీ సీఎం భట్టికి ఇటీవల కౌన్సిలర్లు అందరూ పార్టీలకతీతంగా కమిషనర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే బదిలీ చేయాలని కోరగా, పారిశుధ్యంపై భట్టి సైతం స్వయానా చూసి అసహనం వ్యక్తం చేయడంతో కమిషనర్‌ను బదిలీ చేశారు. మధిర నూతన మునిసిపల్ కమిషనర్‌గా ఖమ్మం కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న సంపత్ కుమార్‌ను నియమించగా, షఫీఉల్లాను ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.

ఐప్యాడ్ వితరణ

వైరా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన మెడిసిన్ విద్యార్థి బొంతు భగత్‌కు ముగ్గురు దాతలు కలిసి ఐప్యాడ్‌ను బుధవారం అందజేశారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మెడిసిన్ ప్రథమ సంవత్సరంలో చేరిన భగత్‌కు ముగ్గురు దాతలు ఐప్యాడ్‌ను బహూకరించారు. మెడికల్ ఎడ్యుకేషన్‌కు అవసరమైన ఐప్యాడ్‌ను బోడపట్ల రవీంద్ర, కొంగర సుధాకర్, రోషన్‌బేగ్ సమకూర్చారు. వైద్యవిద్యలో ఉన్నతంగా రాణించి పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్యసేవలందించాలని ఆకాంక్షించారు.

ఘనంగా అయ్యప్పల ఇరుముడి

తల్లాడ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లో బుధవారం అయ్యప్పమాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. అన్నారుగూడెంలోని రామాలయంలో 12మంది మాలధారులు, బాలపేట ఆంజనేయస్వామి దేవాలయంలో మరో 12మంది మాలధారులకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్వాములు చిట్టెం నర్సింహారావు, పిన్ని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి సంభాని

కల్లూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని పుల్లయ్యబంజర వీధిలో విశ్రాంత హోంగార్డు ఎండీ. రసూల్ మనవరాలి వివాహం ఇటీవల జరిగింది. బుధవారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ రసూల్ నివాస గృహానికి వెళ్లి నూతన వధూవరులను అభినందిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ జె. గోపాలస్వామి, మాజీ ఎంపీటీసీ మాదిరాజు లక్ష్మణరావు, చోటు, యస్‌కే అఫ్రోజ్, యస్‌కె. సమీర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



ఏన్కూర్ మండలానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులు



కారేపల్లిలో నియమకపత్రాలను అందుకుంటున్న నూతన ఉపాధ్యాయులు

కారేపల్లి, అక్టోబరు16:(ఆంధ్రజ్యోతి): మండలానికి నూతనంగా 25మంది ఉపాధ్యాయులు వచ్చారు ఎంఈవో ఎం.జయరాజ్ నియామక పత్రాలను అందజేశారు.

ఏన్కూరు: ఏన్కూరు మండలంలో 20మంది ఉపాధ్యాయులు విధుల్లో నియమితులైనట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు కూరాకుల సైదయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు చింత రాజు, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ మండలానికి 27మందిని కేటాయించారు. వీరిలో 21మంది ఎస్‌జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు పీఈటీలు ఉన్నారు. వీరిలో 26మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. మరో పీఈటీ విధుల్లో చేరాల్సి ఉంది. ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ ఉత్తర్వులను అందజేసి విధి నిర్వహణలో వ్యవహరించాల్సిన తీరుపై పలు సూచనలు చేశారు.

పెనుబల్లి: పెనుబల్లి మండలానికి కేటాయించిన 42మంది ఉపాధ్యాయులతోపాటు వివిధ ఉన్నత పాఠశాలలకు కేటాయించిన ఐదుగురు ఉపాధ్యాయులు, ఇద్దరు పీఈటీలు బుధవారం విధుల్లో చేరారు. వీరు ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, రమేష్, సంఘాల నాయకులు వనమా నాగేశ్వరరావు, వీవీ.రామారావు, శ్రీనివాసరావు, నాళ్ల సురేషబాబు, మహేష్, వీరాస్వామి, ఎన్‌హెచ్.ప్రసాద్, బి.శ్రీని, బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: డీఎస్సీ 2024లో నియామకమైన 14మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించగా బుధవారం వారంతా విధులలో చేరారు. ఎంఈవో నక్కా రాజేశ్వరరావు చేతులమీదుగా ఉత్తర్యులు అందజేశారు.

ఎర్రుపాలెం: నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లోకి చేరారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 28మంది, మండల ప్రాథమిక పాఠశాలల్లో 28మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఈమేరకు ఎంఈవో బి.మురళి నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించారు.

మధిర: నూతనంగా జరిగిన ఉపాధ్యాయుల నియామకాల్లో మధిర డివిజన్‌లోని మధిర మండలానికి 32 మంది ఉపాధ్యాయులు నియామకం కాగా, ఎర్రుపాలెం మండలానికి 65మంది, బోనకల్ మండలానికి 16మంది ఉపా ధ్యాయులు నియామకమయ్యారు. బుధవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఈకార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

బోనకల్: మండలంలో నూతనంగా వచ్చిన 11 మంది ఉపాధ్యాయులకు బుధవారం ఆయన ఎంఆర్‌సీ కార్యాలయంలో నియామక పత్రాలను ఎంఈవో దామాల పుల్లయ్య అందజేసి పాఠశాలల్లో చేర్చుకున్నారు. ఉన్నత పాఠశాలల్లో కొత్తగా ఐదుగురు విధుల్లో చేరారు. పలు సంఘాల నాయకులు కొనకంచి రామ్మోహన్, మద్దినేని వెంకటేశ్వరావు, గుగులోతు రామకృష్ణ, సుధాబాబు, చింతల రవికుమార్, కొమ్ము శ్రీనివాసరావు, కాంతారావు, రవి కిరణ్, వెంకటేశ్వరావు, గోపాలరావు, యాకుబ్ పాషాలు శుభాకాంక్షలు తెలిపారు.



తల్లాడలో మాట్లాడుతున్న ఎంఈవో దామోదర్‌ప్రసాద్

పశు సంపదను పెంపొందించుకోవాలి

▸▸ పశు సంవర్ధక శాఖ ఏడీ డా.వెంకటేశ్వర్లు



కాకర్లపల్లిలో టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీ వెంకటేశ్వర్లు

సత్తుపల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను కాపాడుకుంటూ పశు సంపదనపు పెంపొందించుకోవాలని సత్తుపల్లి పశు సంవర్థక శాఖ ఏడీ డా.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం బుధవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వ్యవహార శైలికి పశుసంపదను పెంపొందించాలని, పశువుల సంఖ్య తక్కువగా ఉందని, పాడిపరిశ్రమను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ ముందు ఉండాలన్నారు. వచ్చేనెల 14వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా 850పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డా.ఈ.ప్రవీణ్, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి మంత్రి పొంగులేటి వితరణ

బోనకల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామంలో చర్చి నిర్మాణానికి సాయం చేయాలని బుధవారం నిర్వాహకులు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో వారికి మంత్రి రూ. 20 వేల నగదు సాయాన్ని అందించారు. తాము అడిగిన వెంటనే స్పందించిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఉమ్మినేని కృష్ణ, బాగం నాగేశ్వ రావు, ఏసుపోగు ప్రభాకర్, తాళ్లూరి రత్నం, తాళ్లూరి ఏసు, తుడుం ప్రసాద్, సామేలు తదితరులున్నారు.



విరాళాన్ని అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

కల్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఖమ్మంపాటి స్నేహను బుధవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. భవన నిర్మాణ కార్మికుడైన రాడ్‌బైండింగ్ మేస్త్రీ ఖమ్మంపాటి బాలస్వామి తన కుమార్తె స్నేహ తాజాగా ప్రకటించిన మెడిసిన్ ఫలితాల్లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు ఉప్పు నరిసింహారావు, ఉపాధ్యక్షుడు అల్లు ఆశీర్వాదం, కార్యదర్శి యస్‌కే మహబూబ్, కోశాధికారి వేల్పుల రవి, గౌరవ అధ్యక్షుడు మార్తాల పిచ్చిరెడ్డి, ఎస్‌కె జానీ, సత్యం తదితతరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయడం అభినందనీయం

▸▸ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



డీఎం రాజ్యలక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): డిపోలో ఉద్యోగులు అందరూ అంకితభావంతో పనిచేస్తుండటంతో డిపోకు లాభాలతో పాటు రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ప్రగతి చక్ర అవార్డులలో భాగంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఇటీవల రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఎమ్మెల్యేను ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలవగా ఆమెను ఎమ్మెల్యే డా.రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డా.మట్టా దయానంద్‌లు శాలువాతో సన్మానించారు.

'ఆదివాసీలకు పట్టాలివ్వాలి'

పెనుబల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండాయిగూడెం ఆదివాసీ గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి షేక్.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండాయిగూడెం ఆదివాసీలతో కలిసి బుధవారం తహసీల్దార్ గంటా ప్రతాప్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివాసీల భూములను సర్వే చేసి ఏడాది అయినా నేటికీ పట్టాలు ఇవ్వలేదని వెంటనే వారికి పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో పారా వెంకటేశ్వర్లు, కుంజా సావిత్రి, కారం కుమారి, పార్వతీ, ఈదెమ్మ, సుజాత, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి: సీపీఎం

ఏన్కూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో బానోతు బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా వీరభద్రం, మేరుగు సత్యనారాయణ, బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, వేల్పుల రాములు, ఇటికాల లెనిన్, కాలసాని సాయి, భూక్యా లచ్చునాయక్, బానోతు అమల, రామచంద్రయ్య, నరసింహారావు, శ్రీనివాసరావు, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరి వెదజల్లే విధానంపై అవగాహన

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని రావికంపాడులో బుధవారం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సీఎస్‌ఆర్ ఫండ్ సహకారంతో భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నేరుగా విత్తే పద్ధతిలో వరి సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా భారతీయ వరి పరిశోధన సంస్థ కీటక విభాగ టెక్నికల్ ఆఫీసర్ వెంకయ్య, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్‌లు రైతులకు నేరుగా విత్తే వరి సాగు పై అవగాహన కల్పించటం జరిగింది. వరి సాగు లాభసాటిగా చేసుకోవటానికి యంత్రీకరణ చాల అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ. రూప, టీ. శ్రీకాంత్, సంతోష్‌రెడ్డి, రైతులు నాగరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పథకాలు అమలు చేయాలి: ఐద్వా



ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మహిళలు

ముదిగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే మహిళలకు ఇస్తానన్న పథకాలను వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతిలు అన్నారు. బుధవారం ముదిగొండలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ధర్నా నిర్వహించారు. పథకాలను వెంటనే అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మందరపు పద్మ, కోలేటి అరుణ, ప్రభావతి, రాణి, రోజా, శాంతమ్మ, లలిత, రేణుక, పుల్లమ్మ తదితరులున్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

మధిర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మధిరలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, పోలీస్ అధికారులు సీజ్‌చేసిన ఇసుకకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. పలువురు ఇసుక వ్యాపారులు రామ గంగాధర్ ఈ వేలంలో రూ.1.73లక్షలకు పాటపాడి ఇసుకను దక్కించుకున్నాడు. ఈ మేరకు నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహించడం జరిగిందని తహసీల్దార్ రాంబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇసుక వ్యాపారులు పాల్గొన్నారు.

గిరిజన సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

ఏన్కూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో నవంబరు 5న జరిగే రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళన పోస్టర్‌ను బుధవారం గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రంలు మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంఘం వ్యవస్థాపకుడు గుగులోత్ ధర్మా ప్రథమ వర్ధంతి సందర్భంగా భక్తరామదాసు కళాక్షేత్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో గిరిజనసంఘం నాయకులు బానోతు బాలాజీ, అమల, భూక్యాలక్ష్మ, భూక్యా శ్రీనివాస్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.



కోత దశకు వచ్చిన వరి పైరు

వాన మబ్బులతో పరేషాన్

▸▸ కోత దశకు వచ్చిన వరి పైరు ▸▸ ఆందోళనలో అన్నదాతలు

కల్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పైరు కోత దశకు వచ్చింది. కల్లూరు మండల పరిధిలో గల పలు గ్రామాల రైతులు యంత్రాలతో వరి కోతలకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో రోజు వారీగా వాన మబ్బులు ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజుల నుంచి వాన మబ్బులు ఏర్పటం, చిరుజల్లులు కురుస్తుండడంతో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పైరుకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడనున్నదని రైతులు దిగాలు పడుతున్నారు. అసలే గత ఏడాది వర్షభావ పరిస్థితి కారణంగా సాగునీటి ఎద్దడితో వానకాలం, యాసంగి పంటలను కోల్పోయిన ఈ ప్రాంత రైతులు, ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌లో ఎంతో ఆశతో రైతులు విస్తారంగా వరి సాగు చేశారు. ఇలా తుఫాన్‌ల ప్రభావంతో, సాగర్ కాల్వకు గండ్ల ప్రభావంతో పొట్టదశకు వచ్చిన వరిపైరు పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పైరు దెబ్బతిన్నది. ఇక సాగర్ కాల్వ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో కల్లూరు మండలంలో సాగు చేసిన వరి పైరు ఇప్పటికే కోతదశకు వచ్చింది. కంకులు పోసుకొని వరి పైరు ఏపుగా ఎదిగింది.

33వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలోనే సాగర్ జలాలను ఆధారంగా చేసుకొని 33 వేల ఎకరాల్లో వరి సాగు అయింది. జిల్లా స్థాయిలోనే కల్లూరు మండలం వరి సాగులో అగ్రగామిగా నిలిచింది. మండలంలో కల్లూరు, లింగాల, వాచ్యానాయక్‌తండ, యర్రబోయిపల్లి, చంద్రుపట్ల, కప్పలబంధం, బత్తులపల్లి, చెన్నూరు తదితర గ్రామాల్లో వరి పక్వానికి వచ్చింది. రైతుల పండించి పంట చేతికి వచ్చే వరకు ఆందోళనకరంగా మారింది. కల్లూరు పెద్దచెరువు కింద రైతులు వరికోతలను ప్రారంభించారు. ఇలా ధాన్యాన్ని అమ్ముకునేందుకు రాశులుగా ఆరబెట్టగా, వర్షం జల్లులు రావడంతో ధాన్యం తడవటంతో బాధిత రైతు ఆందోళన గురువుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కల్లాలో ఆరబెటిన్న ధాన్యం తడవకుండ వ్యవసాయశాఖ, ఏఎంసీ ద్వారా నైనా టార్పాలీన్లు అందించాల్సిన అవసరం ఉంది. ఇలా ప్రకృతి అనుకూలించని పరిస్థితుల్లో నుంచి రైతులను ఆదుకునేందుకు గాను ప్రభుత్వ పరంగా స్వతర చర్యలు తీసుకుని దిగుబడి అయిన ధాన్యం త్వరతగతిన కొనుగోలు చేసేలా సకాలంలో ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వర్షానికి తడవటంతో ధాన్యం రాశిని అరబెడుతున్న రైతులు